క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన అగ్నిమాపకాధికారి



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న ఎం.భూపాల్‌రెడ్డి

కర్నూలు(సెంట్రల్‌): ప్రాంతీయ అగ్నిమాపకాధికారిగా నియమితులైన ఎం.భూపాల్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలెక్టర్‌ పి.కోటేశ్వరరావును కలిశారు. గురువారం ఆయన కలెక్టర్‌ను ఆయన చాంబర్‌లో కలసి పదోన్నతిపై కర్నూలు వచ్చినట్లు తెలిపారు.

కిడ్నీల ఆరోగ్యంపై దృష్టి సారించండి



కిడ్నీడే సందర్భంగా కేక్‌ కట్‌ చేస్తున్న వైద్యుల బృందం

కర్నూలు(హాస్పిటల్‌): మన శరీరంలో చెడును పారదోలి మంచిని ఉంచే కిడ్నీల ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని నెఫ్రాలజిస్టు డాక్టర్‌ జయకృష్ణమూర్తి చెప్పారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక మెడికవర్‌ హాస్పిటల్‌లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతి పది మందిలో ఒకరు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నట్లు తెలిపారు. అధిక రక్తపోటు, మధుమేహం, స్థూలకాయం, వంశపారంపర్యం, అంటువ్యాధులు, మాదకద్రవ్యాలవాడకం, ఇన్‌ఫెక్షన్ల కారణంగా కిడ్నీ వ్యాధులు వస్తాయన్నారు. కిడ్నీల ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ రోజులో గంట పాటు వ్యాయామం, మంచి ఆహారపు అలవాట్లు అలవరచుకోవాలన్నారు. కార్యక్రమంలో హాస్పిటల్‌ వైస్‌ ప్రెసిడెంట్‌ మహేశ్వరరెడ్డి, సెంటర్‌ హెడ్‌ నీలారెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

టెక్నాలజీతో వినికిడి సమస్య దూరం



వినికిడి సామర్థ్య పరీక్ష చేస్తున్న ఆడియాలజిస్టు శివకృష్ణ

కర్నూలు(హాస్పిటల్‌): ఆధునిక టెక్నాలజీతో వినికిడి సమస్య దూరమైందని పారిశ్రామికవేత్త టీజీ భరత్‌ చెప్పారు. స్థానిక గౌరిగోపాల్‌ హాస్పిటల్‌ సమీపాన ఉన్న శ్రీ కృష్ణస్పీచ్‌ అండ్‌ హియరింగ్‌ సెంటర్‌ 17వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం టీజీ భరత్‌ మాట్లాడుతూ.. ఇప్పుడు ఆధునికంగా బ్లూటూత్‌, అండ్‌ ఛార్జింగ్‌ హియరింగ్‌ ఎయిడ్స్‌ అందుబాటులోకి వచ్చాయన్నారు. శ్రీ కృష్ణ స్పీచ్‌ అండ్‌ హియరింగ్‌ సెంటర్‌ అధినేత, ఆడియాలజిస్టు శివకృష్ణ మాట్లాడుతూ.. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 10, 11, 12వ తేదీల్లో వినికిడి మిషన్లను రాయితీతో ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఎన్‌టి వైద్యులు వి.శ్రీధర్‌, ఎస్‌.అనిల్‌కుమార్‌, ఎం.కృష్ణచైతన్య, నారాయణరావు, జి.రాధాకృష్ణ, సకినాల సతీష్‌, కంపెనీ ఏఎస్‌ఎం ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(సెంట్రల్‌): ఉద్యోగుల సమస్యల పరిష్కరించాలని ఏపీజేఏసీ అమరావతి పిలుపు మేరకు గురువారం ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనబాట పట్టారు. కలెక్టరేట్‌ ఎదుట ఏపీ జేఏసీ అమరావతి ప్రధాన కార్యదర్శి కేవై కృష్ణ ఆధ్వర్యంలో ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. వెంటనే ఉద్యోగుల ఆర్థిక, ఆర్థికేతర సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీఆర్‌ఎస్‌ఏ జిల్లా కార్యదర్శి నాగరాజు, నాయకులు నాగరమణయ్య, నాగేశ్వరరరావు పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్‌: పఠాన్‌, బలగం, సార్‌, తూ జూఠీ మై మక్కర్‌, 65
వి మెగా ఆనంద్‌ సినీ కాంప్లెక్స్‌: ఆర్‌ఆర్‌ఆర్‌,సార్‌, బలగం, 65, మిస్టర్‌ కల్యాణ్‌, నేడు విడుదల, దోచేవారెవరురా
వెంకటేష్‌ సినీ కాంప్లెక్స్‌: సర్‌, వినరో భాగ్యము విష్ణు కథ
ఐనాక్స్‌ : యాంట్‌ మ్యాన్‌ అండ్‌ ది వ్యాస్ప్‌ క్వాంటమేనియా, తూ జూఠీ మై మక్కర్‌, క్రీడ్‌-3,65,సీఎస్‌ఐ సనతాన్‌,ట్యాక్సి, స్క్రీమ్‌ 6
భరత్‌ కాంప్లెక్స్‌ : పులి ది నైన్‌టీన్త్‌ సెంచరీ, వాల్తేర్‌ వీరయ్య
రాజ్‌ : సీఎస్‌ఐ సనతాన్‌
శ్రీరామ : ఆర్‌ఆర్‌ఆర్‌
విజయ : పులి ది నైన్‌టీన్త్‌ సెంచరీ

పరిగెడితేనే.. ప్రమాదం

శునకాలు కనపడితే భయం వద్దు

- జాగ్రత్తలు తీసుకుంటే కాటు నుంచి తప్పించుకోవచ్చు
- వాటి వైపు చూడకుండా దూరంగా మెల్లగా నడవాలి
- వీధి కుక్కల నియంత్రణకు అధికారులు చర్యలు



కర్నూలు(అగ్రికల్చర్‌): పట్టణాలు, గ్రామాలు అనే తేడా లేకుండా వీధి కుక్కల సంఖ్య పెరిగిపోతోంది. దీంతో రోడ్లపై గుంపులు గుంపులుగా సంచరిస్తుండటంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. ఇటీవల తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లో చిన్నారిపై కుక్కలు దాడి చేసి ప్రాణాలు బలిగొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రజలు శునకాలు కనిపిస్తేనే భయాందోళన చెందుతున్నారు. అయితే వీధి కుక్కలు కనపడితే పిల్లలు, పెద్దలు భయపడవద్దని, పరిగెడితే వెంటపడి కరుస్తాయని పశుసంవర్ధక శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. తగిన జాగ్రత్తలు తీసుకుంటే కుక్క కాటు నుంచి తప్పించుకోవచ్చని సూచిస్తున్నారు.

3 వేల వీధి కుక్కలకు శస్త్రచికిత్సలు:
ఇటీవల కాలంలో జిల్లాలో కుక్కలు గొర్రెల మందలపై దాడులు చేయడం, విద్యార్థులు, చిన్నారులను కరవడం ఎక్కువైంది. ఈ నేపథ్యంలో వాటి నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా సంతానోత్పత్తి కలగకుండా వాటికి కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేస్తున్నారు. కర్నూలు నగరపాలక సంస్థలో 2022 ఆగస్టు నుంచి ఇప్పటి వరకు దాదాపు 3 వేల వీధి కుక్కలకు శస్త్రచికిత్సలు చేయడం విశేషం. ఆపరేషన్‌ అయిన కుక్కలు దీర్ఘాయుస్సుతో బ్రతకడమే కాకుండా ఆరోగ్యంగా ఉంటాయి. చెవిని కత్తరించి 'వీ' ఆకారంలో ఉంటే ఆపరేషన్‌ అయిందని గుర్తు. ఆడకుక్కల వెంట మగకుక్కలు తిరగడం చాల వరకు తగ్గిపోతుంది. ఆపరేషన్‌ అయినవి కరవడం చాల తక్కువ. ఎందుకంటే వాటిలో ఆగ్రహం తగ్గిపోతుంది. కుక్కల నివారణకు శస్త్ర చికిత్సలు, రేబిస్‌ టీకాలు వేయించడం సురక్షితమైన శాశ్వత పరిష్కారం.

జాగ్రత్తలు ఇలా..

- కుక్క దగ్గరికి వస్తే ఏ మాత్రం కదలకుండా నిలబడి ఉండటం ఉత్తమం. ఎట్టి పరిస్థితుల్లోనూ పరిగెత్తరాదు. కుక్కల కళ్లలోకి తదేకంగా చూడరాదు. వాటి పిల్లల దగ్గరికి వెళ్లరాదు. తల్లి కుక్క కాటువేసే ప్రమాదం ఉంది.
- నిద్రిస్తున్నపుడు, తింటున్నపుడు, పిల్లలకు పాలిస్తున్నపుడు వాటిని కర్రలు, రాళ్లతో అదిలించడం గాని, ఏ రకంగానైన ఇబ్బంది పెట్టొద్దు.
- ఒక వేళ కుక్క దాడి చేస్తే ముఖాన్ని చేతులతో లేదా ఏదైనా కప్పుకోండి. ఎందుకంటే ముఖాన్ని కరిస్తే ఇన్‌ఫెక్షన్‌ మెదడుకు త్వరగా సోకుతుంది
- కుక్క కోపంగా మీ దగ్గరికి వస్తే నేల వైపు చూస్తూ దానికి దూరంగా మెల్లగా నడవాలి. ఎలాంటి భయం లేకుండా తనదారిన తాను పోతే కుక్కలు పట్టించుకోవు.
- ఒక వేళ శునకం కరిస్తే అక్కడ కుళాయి లేదా చెంబుతో నీటిధారపోస్తూ సబ్బుతో పది నిముషాలు కడగాలి. లైఫ్‌బాయ్‌ సబ్బు అయితే మంచిది. డెటాల్‌, బెటాడిన్‌ లేదా గడ్డం గీసుకున్న తర్వాత వాడే లోషన్‌ పూయాలి. వీలైనంత త్వరగా వైద్యుడిని సంప్రదించాలి. పిచ్చి కుక్క అయితే వెంటనే రేబిస్‌ టీకాలు వేయించాలి. అయితే గాయాన్ని రుద్ది కడగరాదు. గాయంపై టింక్చర్‌ అయోడిన్‌ వేయకూడదు. గాయానికి కట్లు వేయడం, గట్టిగా నొక్కడం చేయరాదు

భయపడేకొద్దీ చెలరేగిపోతాయి



తగిన జాగ్రత్తలు తీసుకుంటే కుక్కకాటు నుంచి తప్పించుకోవచ్చు. కొంతమంది కుక్కలను చూసి కరుస్తాయనే భయంతో ముందుకు వెళ్లరు. అది పద్ధతి కాదు. మనం భయపడేకొద్దీ కుక్కలు చెలరేగిపోతాయి. ప్రభుత్వం వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా కార్పొరేషన్‌, మున్సిపాలిటీలు, పంచాయతీల్లో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేపడుతున్నారు. పెంపుడు కుక్కలకు విధిగా టీకాలు వేయించాలి.

– డాక్టర్‌ రవిబాబు, అసిస్టెంటు డైరెక్టర్‌, పశు వ్యాధి నిర్ధారణ కేంద్రం

15న కౌలు రైతుల జిల్లా సదస్సు

కర్నూలు(సెంట్రల్‌): మార్చి 15వ తేదీన ఆస్పరిలో కౌలు రైతుల జిల్లా స్థాయి సదస్సును నిర్వహిస్తున్నట్లు ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.జగన్నాథం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.రామచంద్రయ్య, కౌలు రైతు సంఘాల రాష్ట్ర కన్వీనర్‌ జమ్ములయ్య, రైతు సంఘం ఉపాధ్యక్షుడు ఎ.కాటమయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి హాజరు కానున్నట్లు చెప్పారు.

మార్కెట్‌ యార్డులో చైర్మన్‌ పర్యటన

కర్నూలు(అగ్రికల్చర్‌): కర్నూలు వ్యవసాయ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ ఎస్‌.ప్రభాకర్‌రెడ్డి మార్కెట్‌ యార్డులో విస్తృతంగా పర్యటించారు. శాసనమండలి ఎన్నికల ప్రక్రియ మొదలైన తర్వాత చైర్మన్‌ మార్కెట్‌కు రావడం లేదు. గురువారం మార్కెట్‌కు వచ్చిన ఆయన యార్డులో పర్యటించారు. టెండర్‌ హాల్‌లో లాట్‌ల వారీగా ధరల ప్రకటనను పరిశీలించారు. అనంతరం జంబోషెడ్‌ నిర్మాణ పనులను పరిశీలించి, పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని మార్కెటింగ్‌ శాఖ ఇంజినీరింగ్‌ అధికారులను ఆదేశించారు. యార్డులో పరిశుభ్రత పనులను మరింత పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. ఆయన వెంట సెక్రటరీ గోవిందు, అసిస్టెంటు సెక్రటరీలు, రహిమాన్‌, వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, శివన్న తదితరులు ఉన్నారు.

నేటి నుంచి మహిళలకు క్రీడా పోటీలు

- పోషకాహారంపై అవగాహన సదస్సులు, ఉచిత వైద్య శిబిరాలు
- జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సీఈఓ రమణ వెల్లడి



కర్నూలు (టౌన్‌): ప్రభుత్వ ఆదేశాల మేరకు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 10 తేదీ(నేటి) నుంచి 25వ తేదీ వరకు మహిళలకు క్రీడా పోటీలు, పోషకాహారంపై అవగాహన సదస్సులు, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సీఈఓ రమణ వెల్లడించారు. గురువారం స్థానిక స్పోర్ట్స్‌ అథారిటీ స్టేడియంలోని తన చాంబర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. నేడు(శుక్రవారం) ఐసీడీఎస్‌, మెప్మా, డీఆర్‌డీఏ, మున్సిపల్‌ కార్పొరేషన్‌కు చెందిన సిబ్బందితో కలెక్టరేట్‌ నుంచి రాజ్‌ విహార్‌ వరకు ర్యాలీ, స్థానిక ఇండోర్‌ స్టేడియంలో యోగా, బ్యాడ్మింటన్‌ పోటీలు ఉంటాయన్నారు. 11వ తేదీ మెడికవర్‌ హాస్పిటల్‌లో మెడికల్‌ క్యాంపు, స్టేడియంలో మాస్టర్స్‌ అథ్లెటిక్స్‌, కబడ్డీ పోటీలు, 12వ తేదీ లైఫ్‌లైన్‌ హోమియోపతి ఆసుపత్రిలో హోమియోపతి మెడికల్‌ క్యాంపు, స్టేడియంలో ఎస్‌వీఆర్‌ కోచింగ్‌ సెంటర్‌ నిర్వహణలో స్కిప్పింగ్‌ రోప్‌, టగ్‌-ఆఫ్‌-వార్‌, 14వ తేదీ న్యూట్రిషియన్‌ రీ హాబిటేషన్‌ సెంటర్‌ ఆధ్వర్యంలో స్థానిక స్టేడియంలో పోషకాహారంపై అవగాహన సదస్సులు, అలాగే కేవీఆర్‌ మహిళా కళాశాలలో టగ్‌-ఆఫ్‌-వార్‌, టెన్నికాయిట్‌ పోటీలు ఉంటాయన్నారు. 15వ తేదీ స్టేడియంలో రెవెన్యూ, పంచాయతీరాజ్‌ మహిళా ఉద్యోగులకు లెమన్‌స్పూన్‌, శాక్‌వాక్‌, త్రోబాల్‌, స్కిప్పింగ్‌ రోప్‌ పోటీలు, 16న స్టేడియంలో 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు పరుగు పందెం, జావెలిన్‌త్రో, షాట్‌పుట్‌ పోటీలు, 17న స్పోర్ట్స్‌ అథారిటీ స్టేడియంలో మ్యూజికల్‌ చైర్స్‌, 400 మీటర్ల స్పీడ్‌ వాక్‌, శాక్‌వాక్‌, తొక్కుడు బిల్ల, టగ్‌-ఆఫ్‌-వార్‌, 18న డీఎంహెచ్‌ఓ ఆధ్వర్యంలో స్థానిక స్టేడియంలో హిమగ్లోబిన్‌ స్థాయిలు, బ్రెస్ట్‌ క్యాన్సర్‌ వంటి అంశాలపై అవగాహన సదస్సు, బాస్కెట్‌బాల్‌ పోటీలు, 19న సిల్వర్‌ జూబ్లీ కళాశాల క్రీడా మైదానంలో స్కిప్పింగ్‌ రోప్‌, తొక్కుడు బిల్ల, లెమన్‌స్పూన్‌ పోటీలు, 20న సెయింట్‌ జోసఫ్‌ డిగ్రీ కళాశాలలో శాక్‌రేస్‌, నీడిల్‌ మరియు త్రేడ్‌, మ్యూజికల్‌ చైర్స్‌, త్రోబాల్‌ పోటీలు, 21న స్టేడియంలో వాలీబాల్‌, హ్యాండ్‌బాల్‌ పోటీలు, కుకింగ్‌ పోటీలు, 23న స్టేడియంలో కర్నూలు మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలోని సచివాలయాల ఉద్యోగులకు 400 మీటర్ల పరుగు, స్పీడ్‌వాక్‌, త్రోబాల్‌, శాక్‌రేస్‌, 24న స్థానిక మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్పోర్ట్స్‌ అథారిటీ స్టేడియంలో సాంస్కృతిక కార్యక్రమాలు, రోలర్‌ స్కేటింగ్‌, 25న స్టేడియంలో క్రీడారంగంలో ప్రతిభ చాటిన మహిళా క్రీడాకారులకు సత్కారం, విన్నర్స్‌కు మెడల్స్‌ అందజేయడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పోటీల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.



పరుగు పందెం పోటీల్లో పాల్గొన్న మహిళలు

క్రీడల్లోనూ రాణించాలి

కర్నూలు (టౌన్‌): మహిళలు అన్ని రంగాల్లో రాణించడం శుభపరిణామమని, క్రీడల్లోనూ అదే స్ఫూర్తి ప్రదర్శించాలని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్‌ శంకర్‌ శర్మ అన్నారు. గురువారం స్థానిక బి.క్యాంపు క్రీడా మైదానంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని క్రీడా సంబరాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అనంతరం స్పోర్ట్స్‌ కోటాలో ఉద్యోగాలు సాధించిన మహిళలను సన్మానించారు. మహిళలకు 1600 మీటర్లు, 100 మీటర్ల పరుగు పోటీలు నిర్వహించి విజేతలకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్‌ సంఘం అధ్యక్షులు రామాంజనేయులు, క్రీడా సంఘాల ప్రతినిధులు సురేందర్‌, సుధీర్‌, కోలా ప్రతాప్‌, ఎండీ బాషా, చిన్న సుంకన్న పాల్గొన్నారు.

పట్టభద్రులు ఆలోచనతో ఓటేయాలి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీ మోహన్‌రెడ్డి

కర్నూలు(రాజ్‌విహార్‌): ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పట్ల పూర్తి అవగాహన కలిగిన పట్టభద్రులు ఆలోచించి ఓటేయాలని కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీ మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం రాత్రి ఆయన నగరంలోని 50, 51వ వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీఎం ఆశయాలకు అనుగుణంగా పనిచేసే పట్టభద్రుల శాసన మండలి సభ్యుడు వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్య ఓటు వేయాలని కోరారు.

రేషన్‌ బియ్యం పట్టివేత

కర్నూలు(టౌన్‌): నాల్గవ పట్టణ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని టైలర్స్‌ కాలనీలో రేషన్‌ బియ్యం పట్టుబడింది. గురువారం సమాచారం మేరకు విజిలెన్స్‌ అధికారులు ఓ వాహనాన్ని తనిఖీ చేశారు. అందులో 57 క్వింటాళ్ల రేషన్‌ బియ్యం పట్టుకొని సీజ్‌ చేశారు. నిందితులు ఫయాజ్‌, ఆంజనేయులును అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు వెల్లడించారు.

సుంకేసులకు ఇన్‌ ఫ్లో

గూడూరు: సుంకేసులకు గురువారం 630 క్యూసెక్కుల ఇన్‌ ఫ్లో ఉంది. డ్యాంలో 0.751 టీఎంసీల నీటి నిల్వ ఉంది. కేసీ కాల్వకు 935 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

భక్తితో ఆరాధిస్తే సకల శుభాలు

– ఎమ్మెల్యే కాటసాని, మేయర్‌ రామయ్య

కల్లూరు: భక్తితో ఆరాధిస్తే సకల శుభాలు కలుగుతాయని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, నగర మేయర్‌ బీవై రామయ్య అన్నారు. గురువారం కల్లూరులోని ఇండస్ట్రియల్‌ ఎస్టేట్‌ ఉమామహేశ్వర నగర్‌లో ఉన్న ఉమామహేశ్వర పరివార, నవగ్రహ, ధ్వజ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో ఎమ్మెల్యే కాటసాని, మేయర్‌ రామయ్య పాల్గొని ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్‌ సిద్దారెడ్డి రేణుక, కార్పొరేటర్లు సాఫూరు మాధురి, సాన శ్రీనివాసులు, డి.లక్ష్మీకాంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆదాయం రూ.12.58 లక్షలు



కర్నూలు (న్యూటౌన్‌): మండల పరిధిలోని వెంకాయపల్లె ఎల్లమ్మ అమ్మవారికి ఆలయ హుండీలో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ.12.58 లక్షల ఆదాయం సమకూరింది. గురువారం ఆలయంలో హుండీ కానుకలను లెక్కించారు. రెండు నెలల్లో అమ్మవారికి భక్తులు రూ.12,58,363 సమర్పించారని దేవస్థానం ఈఓ సీతారామిరెడ్డి తెలిపారు. కానుకల లెక్కింపులో గోశాల ఈఓ హనుమంతరావు, దేవస్థానం చైర్మన్‌ బేతం కృష్ణుడు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఒక్క ఓటు కూడా పక్కకు పోరాదు





ప్రసంగిస్తున్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, హాజరైన ఎంపీటీసీ, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు, గ్రాడ్యుయేట్లు

- రాష్ట్రంలోనే అధిక మెజార్టీ నందికొట్కూరుకే దక్కాలి
- శాప్‌ చైర్మన్‌ బైరెడ్డి సిద్ధార్థ్‌ రెడ్డి
- నియోజకవర్గ ఎంపీటీసీ, జెడ్పీటీసీ, కౌన్సిలర్లతో సమావేశం
- హాజరైన వైఎస్సార్‌సీపీ రీజనల్‌ కోఆర్డినేటర్‌ రామసుబ్బారెడ్డి, అభ్యర్థులు డాక్టర్‌ మధుసూదన్‌, వెన్నపూస రవీంద్రారెడ్డి

కర్నూలు(రాజ్‌విహార్‌): శాసన మండలి ఎన్నికల్లో మన ఓట్లు ఒక్కటి కూడా పక్కకి పోరాదని వైఎస్‌ఆర్‌ కాంగ్రెస్‌ పార్టీ నందికొట్కూరు నియోజకవర్గ సమన్వయ కర్త, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, శాప్‌ చైర్మన్‌ బైరెడ్డి సిద్దార్థ్‌ రెడ్డి అన్నారు. మండలి ఎన్నికల నేపథ్యంలో గురువారం స్థానిక కార్యాలయంలో నందికొట్కూరు నియోజకవర్గం ఎంపీపీలు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, కౌన్సిలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలి ఎన్నికలను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కీలకంగా తీసుకున్నారని చెప్పారు. తన పరిధిలోని ఒక్క ఓటు కూడా మిస్‌ కాదని తనకు తెలుసని, అయితే నిర్ణీత సమయంలోపు ఓటు వేయాలన్నారు. ప్రతి ఒక్కరూ సైనికుడిలా పనిచేసి నందికొట్కూరుకు మెజారిటీ రాష్ట్రంలోనే అధికంగా దక్కేలా చూడాలన్నారు. స్థానిక సంస్థల అభ్యర్థి డాక్టర్‌ మధుసూదన్‌ది తమ నియోజకవర్గం కావడంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు మనవే కావాలని, ఈ గెలుపుతో మరో సారి మన సత్తా చాటుకోవాల్సిన అవసరం వచ్చిందన్నారు. అనంతరం ఉమ్మడి జిల్లా పార్టీ రీజినల్‌ కో ఆర్డినేటర్‌ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ.. మండలి ఎన్నికల్లో మన ఓట్లు వేసుకోవడంతో పాటు తోటి ఓటర్లను ప్రలోభాలకు గురి కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు. సాధారణ గెలుపు కంటే భారీ మెజారిటీ దక్కేలా అనుసరించాలని సూచించారు. సమష్టిగా కృషి చేస్తేనే ఇది సాధ్యమవుతుందని వెల్లడించారు. నందికొట్కూరుపై ప్రభుత్వానికి ప్రత్యేక అభిమానం ఉందని, దీనిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. అనంతరం మండలి అభ్యర్థులు డాక్టర్‌ ఎ.మధుసూదన్‌ (స్థానిక సంస్థలు), వెన్నపూస రవీంద్రారెడ్డి (పట్టభద్రులు) మాట్లాడుతూ గొప్ప ఆశయాలతో సీఎం జగన్‌ ముందుకు వెళ్తున్నారని, తమను ఈ ఎన్నికల్లో గెలిపిస్తే ఆయన లక్ష్యాలకు అనుగుణంగా పని చేస్తామన్నారు. మొదటి ప్రాధాన్యత ఓటుతో తమను గెలిపిస్తే మండలిలో స్థానిక సమస్యలు, పట్టభద్రుల సమస్యలపై మాట్లాడుతామని తెలిపారు. సమావేశంలో నందికొట్కూరు నియోజకవర్గ జెడ్పీటీసీలు యుగంధర్‌రెడ్డి, సోములు, సుధాకర్‌, జగతి రెడ్డి, దివ్య, ఎంపీపీలు మురళీకృష్ణారెడ్డి, మండ్ల మల్లేశ్వరి, సువర్ణమ్మ, కుసుమలత, మున్సిపల్‌ చైర్మన్‌ దాసి సుధాకర్‌రెడ్డి, వైస్‌ చైర్మన్‌ ప్రశాంతి, మార్కెట్‌ యార్డు మాజీ చైర్మన్‌ సుధాకర్‌రెడ్డి, వైస్‌ చైర్మన్‌ రమేష్‌ నాయుడు, కౌన్సిలర్లు, వైస్‌ ఎంపీపీలు పాల్గొన్నారు.

వెన్నపూస ఎన్నికల ప్రచారం



న్యాయవాదులను ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి

కర్నూలు(లీగల్‌): పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీస్థానానికి పోటీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి గురువారం జిల్లా కోర్టు ఆవరణలో ప్రచారం నిర్వహించారు. ఉదయం 11 గంటల నుంచి కోర్టు ఆవరణలో కలియతిరిగి న్యాయవాదులను ఓటు అభ్యర్థించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ లీగల్‌ సెల్‌ న్యాయవాదులు తదితరులు ఉన్నారు.

ముగ్గురి బైండోవర్‌

కర్నూలు (టౌన్‌): నగరంలోని మూడవ పట్టణ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చెడు నడత కలిగి ఇతరులకు ఇబ్బందులు కలిగిస్తున్న బుధవారపేటకు చెందిన ఆముదం బాబు, బోయ మద్దిలేటి, వనమాల లోకేశ్వర రెడ్డిలను గురువారం కల్లూరు తహసీల్దార్‌ రమేష్‌బాబు ఎదుట హాజరుపరిచి బైండోవర్‌ చేశారు. ఆరు నెలల పాటు సత్ప్రవర్తన కలిగి ఉంటామని అంగీకరించడంతో రూ.లక్ష పూచీకత్తుపై విడుదల చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

ఓటీ సొమ్ము చెల్లించాలి

కర్నూలు(రాజ్‌విహార్‌): ప్రజా రవాణ శాఖ ఉద్యోగుల ఓటీ సొమ్ము చెల్లించాలని ఎంప్లాయిస్‌ యూనియన్‌ కర్నూలు-2 డిపో కార్యదర్శి మహేశ్వరరావు డిమాండ్‌ చేశారు. గురువారం ఆ సంఘం ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో డిపో ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నైట్‌ అవుట్‌ తోపాటు ఇతర అలవెన్స్‌లు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు కృష్ణార్జున రెడ్డి, రాము, కృష్ణ, సురేష్‌ పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యం



అబ్దుల్‌ రషీద్‌

కర్నూలు (టౌన్‌): నగరంలోని మూడవ పట్టణ పోలీసు స్టేషన్‌ పరిధిలో ఓ బాలుడు అదృశ్యమయ్యాడు. స్థానిక బి.క్యాంపు ఆరోరానగర్‌కు చెందిన హెచ్‌.అబ్దుల్‌ రఫీక్‌ కుమారుడు హెచ్‌ అబ్దుల్‌ రషీద్‌ ఈ నెల 5వ తేదీ ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్ల, ఇతర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ నేపథ్యంలో తండ్రి మూడవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాలుడు మూగవాడని, మతిస్థిమితం సరిగ్గా లేదని, 12 సంవత్సరాల వయస్సు ఉంటుందని, 5 అడుగుల ఎత్తు, చామనచాయ కలిగి ఉంటాడని పోలీసులు తెలిపారు. ఆచూకీ లభిస్తే సీఐ 9121101061 సెల్‌ నంబర్‌కు తెలియజేయాలని కోరారు.

యుద్ధప్రాతిపదికన పైప్‌లైన్‌ పనులు



మునగాలపాడు వద్ద ప్రధాన పైప్‌లైన్‌కు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

కర్నూలు(టౌన్‌): కర్నూలు నగరంలోని మునగాలపాడు వద్ద 1200 ఎంఎం సామర్థ్యం కలిగిన పైప్‌లైన్‌ లీకేజీ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నారు. నగరపాలక కమిషనర్‌ భార్గవతేజ ఆదేశాల మేరకు ఇంజినీరింగ్‌ విభాగానికి చెందిన ఎస్‌ఈ శేషసాయి, డీఈ రవిప్రకాష్‌ నాయుడు అక్కడే ఉండి మరమ్మతు పనులు చేయిస్తున్నారు. గురువారం వారు మాట్లాడుతూ ప్రధాన పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపడుతున్న కారణంగా నగరవాసులకు రెండు రోజులు తాగునీటి సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం నాటికి పనులు పూర్తవుతాయని చెప్పారు.

స్థిరమైన వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలి



సన్మానం అందుకున్న ఉద్యోగినులతో జలవనరుల శాఖ ఇంజినీర్లు, అధికారులు

కర్నూలు కల్చరల్‌: మహిళలు తమ జీవిత లక్ష్యాలను అందుకోవడానికి స్థిరమైన వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలని కర్నూలు జిల్లా ఫ్యామిలీ కోర్టు జడ్జి జి.ప్రతిభా దేవి, హైదరాబాదు పెన్నీ వైస్‌ సొల్యూషన్స్‌ సంస్థ జీఎం శశికళ, అనంతపురం జవహర్‌లాల్‌ నెహ్రూ టెక్నలాజికల్‌ యూనివర్శిటీ ఎగ్జిక్యూటివ్‌ కౌన్సిల్‌ మెంబర్‌ డాక్టర్‌ జె.మమతా మోహన్‌ అన్నారు. గురువారం రవీంద్ర మహిళా ఇంజనీరింగ్‌ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ముగ్ద 2కె23 అనే శీర్షికతో వేడుకలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ..మహిళలు ఉన్నతమైన విద్యావకాశాలను అందిపుచ్చుకోవడంతో పాటు తమ తల్లిదండ్రులను గౌరవించాలన్నారు. సమాజంలో జరుగుతున్న అరాచకాలను దృష్టిలో ఉంచుకుని ఎల్లప్పుడూ జాగరూకులై ఉండాలన్నారు. అనంతరం వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల స్పెషల్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ వై.పాండురంగయ్య, ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ కె.ఇ.శ్రీనివాసమూర్తి, వైస్‌ ప్రిన్సిపాల్‌ జె.ఉషశ్రీ తదితరులు పాల్గొన్నారు.

జలవనరుల శాఖ కార్యాలయంలో..
అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జలవనరుల శాఖ ముఖ్య ఇంజినీర్‌ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ఇంజినీర్‌ కబీర్‌ బాషా, డిప్యూటీ చీఫ్‌ ఇంజినీర్‌ లక్ష్మానాయక్‌, సూపరింటెండెంట్‌ కమలాకర్‌ ఆధ్వర్యంలో ఆటల పోటీల్లో పాల్గొన్న మహిళా ఉద్యోగినులకు బహుమతులు అందజేసి శాలువాలతో సత్కరించారు.